క్లుప్తంగా

సొంతగుడికి అమ్మవార్లు



చండిపుట్టుగలో చండికేశ్వరి అమ్మవారిని సొంతగుడికి సాగనంపుతున్న భక్తులు

కవిటి:దసరా సందర్భంగా వివిధ గ్రామాల్లో కొలువైన అమ్మవార్లు సొంతగుడికి చేరుకున్నాయి. మాణిక్యపురంలోని మాణికేశ్వరి అమ్మవారు, కవిటి చింతామణి అమ్మవారు, చండిపురం చండికేశ్వరి అమ్మవారు,జగతి పోలమ్మ తల్లి, బొరివంక.బెజ్జిపుట్టుగ గ్రామదేవతలు అసిరిపోలమ్మ అమ్మవారు, వరక అన్నపూర్ణమ్మ అమ్మవారు, బల్లిపుట్టుగ, కుసుంపురంలో వెలసిన సింధుపురాణి అమ్మవార్లు దసరా పండుగ వేడుకల నడుమ తమతమ సొంత గుడులకు మంగళవారం తిరుగు పయనమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా యువతీ యువకులు నృత్యాలు చేస్తూ.. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు.

టెక్కలిపట్నంలో బతుకమ్మ సందడి



బతుకమ్మలతో మహిళల ఊరేగింపు

పలాస: టెక్కలిపట్నంలో సింధు కుటారమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని కొలుస్తూ బతుకమ్మ పండుగను మంగళవారం రాత్రి ఘనంగా జరిపారు. పెద్దా.. చిన్నా తారతమ్యం లేకుండా బతుకమ్మ పాటలతో అమ్మవారిని పూజించారు. సర్పంచ్ పి.పద్మావతి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని పూజించి యువతలు, చిన్నారులు నృత్యాలతో గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

దుర్గమ్మకు జలాభిషేకం



కలశాలతో తెచ్చిన జలంతో భవానీమాతలు

ఇచ్ఛాపురం రూరల్: దుర్గాష్టమి సందర్భంగా తేలుకుంచి గ్రామంలో సుమారు 200 మంది భవానీ మాలధారణ చేసిన మహిళలు అమ్మకు జలాభిషేకాన్ని మంగళవారం చేశారు. 11 రోజుల పాటు భవానీ మాలధారణ చేసిన వారంతా స్థానిక బహుదానది నుంచి కలశాలతో జలాన్ని ఊరేగింపుగా తెచ్చి దుర్గాభవానీకి అభిషేకం చేశారు.

సరస్వతీ పంచరాత్రి మహోత్సవం ప్రారంభం



తేలుకుంచిలో కొలుదీరిన సరస్వతీదేవి విగ్రహం

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు, తేలుకుంచి గ్రామాల్లో సరస్వతీ పంచరాత్రి మహోత్సావాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముఖద్వారం ప్రారంభోత్సవం



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: పాతటెక్కలిలోని పాలపోలమ్మ, పాతపట్నం అమ్మవార్ల ఆలయ ముఖద్వారాన్ని స్థానిక సర్పంచ్ తుంగాన సుశీల మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంలో నిర్మించిన ముఖద్వారాన్ని అష్టమి రోజున ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని సర్పంచ్ అన్నారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ముఖద్వారం నిర్మాణంకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తుంగాన ధర్మరాజు, లక్ష్మీనారాయణ, కర్ని వెంకటరమణమూర్తి, ఎ.జోగారావు, బి.కృష్ణారావు, ప్రకాశరావు, పి.రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రణాశురమ్మ తిరువీధి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఉప్పాడవీధిలో దుర్గా నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని రణాశుర అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉప్పాడవీధి నుంచి నీలకంఠేశ్వరవీధి, కృష్ణబజా ర్, కార్జీవీధి, దానంపేట మీదుగా మెయిన్‌రోడ్ గుండా పీర్లకొండ, సూదికొండల మధ్య ఉన్న అమ్మవారి పుట్ట వరకు మేళతాళాలతో తిరువీధి నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం!

- మున్సిపాలిటీలో పేరుకుపోతున్న చెత్త
- శానిటేషన్ నిర్వహణలో లోపం
- అనారోగ్యం బారిన ప్రజలు



శివాజీనగర్‌లో పేరుకుపోయిన చెత్త



పలాస చేపల మార్కెటు వద్ద రోడ్డుపైన

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వర్షాకాలంలో కుళ్లి కంపు కొడుతున్న చెత్తతో ప్రజలు పడుతున్న బాధలు అంతా ఇంతా కాదు. మున్సిపాలిటీలో మొత్తం 31 వార్డులు ఉన్నాయి. ప్రధాన పట్టణాలైన పలాస–కాశీబుగ్గను మినహాయిస్తే ఎక్కువ శాతం గ్రామీణ వాతావరణలో ఉన్న కాలనీలు, గ్రామాలు, మురికివాడలే ఉన్నాయి. వీటిలో చెత్త నిర్వహణ కోసం ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులు 11 మంది ఉండగా మరో 76 మంది ప్రైవేటు కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా రోజూ ఉదయం పూట చెత్త తీస్తుంటారు. ఈ విధంగా రోజుకు తడి, చెత్త 18 టన్నులు, పొడి చెత్త మరో 18 టన్నులు వరకు సేకరిస్తున్నామని శానిటేషన్ ఇన్‌స్పెక్టరు ఉదయ్ చెబుతున్నారు. ఈ విధంగా చెత్తను తొలగించి ట్రాక్టర్లతో డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. అయితే సాయింత్రమయ్యే సరికి రోడ్లన్నీ చెత్త కుప్పలతో దర్శనిమిస్తున్నాయి. చెత్త నిర్వహణలో కూడా లోపం ఉందని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చికెన్, మటన్ సెంటర్లు, సంత మైదానం, కాయగూరలు మార్కెటు తదితర ప్రాంతాల్లో, ప్రయాణికులు రద్దీగా ఉన్న కాశీబుగ్గ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. వర్షం పడితే రోడ్డు పక్క అడుగు పెట్టలేని పరిస్థితి. ఇకపోతే గతంలో పంచాయతీలుగా ఉన్న తాళభద్ర, నీలాపురం, పెసరపాడు, చినబాడాం, అంతరకుడ్డ మొగిలిపాడు, కోసంగిపురం తదితర గ్రామాలు మున్సిపాలిటీలో కలిపినప్పటికీ.. పట్టణానికి దూరంగా ఉండటంతో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రెండు, మూడు రోజులకు ఒకసారి కూడా రావడం లేదని ఆరోపిస్తున్నారు. కాగా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య లోపంపై మున్సిపల్ సమావేశాల్లో సభ్యులు తరచూ ప్రస్తావిస్తున్నారు. అలాగే ఇటీవలో పట్టణంలో పర్యటించిన అసిస్టెంట్ కలెక్టర్ సైతం పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు పక్క చెత్తతో ఇబ్బంది



మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఒక పూట వస్తే మరో పూట రావడం లేదు. ఒక్కోసారి రోజంతా రావడం లేదు. ప్రజలు రోడ్డు మీదనే చెత్త వేస్తున్నారు. దీనివల్ల చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. ఒక్కోసారి వర్షం వస్తే అవి కుళ్లి కంపుకొడుతున్నాయి. ఇంట్లోని వ్యర్థాలన్నీ రోడ్డుమీద పోస్తున్నారు.

– ఉప్పాడ వెంకటరమణ, సూదికొండకాలనీ, పలాస

వీధుల్లోకి రావడం లేదు



పారిశుద్ధ్య కార్మికులు వీధుల్లోకి సరిగ్గా రావడం లేదు. ఒక వేళ వచ్చినా నామమాత్రంగా చెత్తను తుడిచి ఒకచోటకు చేర్చి వెళ్లి పోతున్నారు. దాన్ని తీసుకెళ్లడానికి ఎవరు ఎప్పుడు వస్తారో తెలియదు. ఒకవేళ వారు వచ్చినా అప్పటికే మళ్లీ రోడ్డంతా చెత్త చెత్తగా ఉంటుంది. దీంతో రోగాలు ప్రబలే అవకాశం ఉంది.

బగాది సింహాచలం, సూదికొండ, 19వ వార్డు, పలాస

ప్రజలను అవగాహన కల్పిస్తున్నాం

పారిశధ్యంపై ప్రతి శనివారం ప్రజలను అవగాహన కల్పిస్తున్నాం. పారిశుద్ధ్య కార్మికులు తక్కువ మంది ఉన్నారు. ఏరియా చాలా పెద్దది. వీలున్నంత వరకు రోజుకు సుమారు 36 టన్నులు చెత్తను సేకరిస్తున్నాం. ప్రత్యేకంగా మార్కెటు, దుకాణాల వద్ద ఎక్కువగా చెత్త పోగవుతుంది. దాన్ని రోజూ తొలగిస్తున్నాం.

– ఉదయ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్

ఇచ్ఛాపురంపై టీడీపీకి చిత్తశుద్ధి కరువు

- వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న నరేంద్ర యాదవ్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంపై టీడీపీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధిలేదని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన శాసన మండలి సమావేశాల్లో నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రస్తావించడం అభినందనీయమన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1983 నుంచి సుమారు 37 ఏళ్ల పాటు టీడీపీకి చెందిన వ్యక్తులే నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఎలాంటి ప్రగతిసాధించలేదన్నారు. 15 ఏళ్ల పదవిలో ఉన్న ఎం.వి.కృష్ణారావు, 12 ఏళ్ల పదవిలో ప్రస్తుతం కొనసాగుతున్న బెందాళం అశోక్‌లు ఇచ్ఛాపురం సమస్యలపై తూతూ మంత్రంగా శాసన సభలో ప్రస్తావిస్తే.. కేవలం రెండేళ్లలో ఎమ్మెల్సీ నర్తు రామారావు వ్యవసాయ రంగానికి అవసరమైన సాగునీటి వనరులు, బెంతు ఒరియాల సమస్యలు, ఉద్దానం కిడ్నీ సమస్యలు, వంశధార మిగులు జలాలను ఇచ్ఛాపురం వరకు తీసుకురావలసిన ఆవశ్యకత, పైడిగాం ప్రాజెక్ట్ ఆధునికీకరణ, ఇచ్ఛాపురం, బారువ, సోంపేట ఆస్పత్రులకుకు డయాల్సిస్ కేంద్రాల మంజూరు, ఉద్దానం ప్రాజెక్ట్‌లో 29 ఏళ్లగా పనిచేస్తున్న 104 మంది కార్మికుల తొలగింపు, యూరియా కొరతపై ప్రశ్నించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోనే రూ. 46 వేల తలసరి ఆదాయంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం అట్టడుగున ఉండడానికి గడిచిన 37 ఏళ్లగా ప్రాతినిధ్యం వహించిన టీడీపీ ఎమ్మెల్యేలే బాధ్యత వహించవలసి ఉందని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, తులసిగాం సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసీరామ్‌లు ఉన్నారు.

విద్యార్థి విభాగం కమిటీలు పూర్తి చేయాలి



విద్యార్థి విభాగం కమిటీ సభ్యులతో డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తిలక్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కమిటీలు పూర్తి చేసే విధంగా యువత సహకరించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. మంగళవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో విద్యార్థి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఎంతో మంది పేద, సామాన్య వర్గాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేఖ విధానాలపై పోరాటం చేయడానికి విద్యార్థులంతా సిద్ధంగా ఉండాలని.. వారికి అండగా ఉంటామని తిలక్ భరోసా నిచ్చారు.

బాధితులకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి, నాయకులు

నందిగాం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు చేస్తున్న కక్షసాధింపు చర్యలను న్యాయపరంగా ఎదుర్కోవడానికి డిజిటల్ బుక్ ఉపయోగ పడుతోందని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి డిజిటల్ బుక్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమలు చేయలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాల కోసం నిలదీస్తుంటే అధికారం అడ్డుపెట్టుకొని కక్షపూరితంగా కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అన్యాయంగా ఇబ్బందులకు గురైన వారిని న్యాయపరంగా ఆదుకోవడం కోసం, కార్యకర్తలకు రక్షణ కల్పించడానికి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను రూపకల్పన చేశారని అన్నారు. అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ నిర్భయంగా డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, అంబోడి విష్ణు, బొంగి హనుమంతురావు, బొమ్మాళి గున్నయ్య, దీర్ఘాశి కృష్ణారావు, అట్టాడ అప్పన్న ఉన్నారు.

4, 5 తేదీల్లో సీఐటీయూ మహాసభలు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఇచ్ఛాపురం: సోంపేటలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ లైబ్రరీ ఆవరణలో మండలస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తు చేపడుతున్న ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. సీఐటీయూ ప్రతినిధులు రమేష్‌పట్నాయక్, రంగాల శ్రీనివాసరావు, హైమావతి పాల్గొన్నారు.

ఉల్లిపాయల లారీ బోల్తా

- ఇద్దరికి స్వల్ప గాయాలు



క్రేన్‌తో చెరువులోనుంచి లారీని బయటకు తీస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండిగేటు–పెద్దబాణాపురం మధ్య మంగళవారం వేకువజామున ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి కోల్‌కత్తా వెళ్తున్న లారీ బాణాపసురం దాటాక అదుపుతప్పి చెరువులో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సబల్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్‌ను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిచారు. అనంతరం ప్రత్యేక క్రేన్ తెప్పించి లారీని చెరువు నుంచి బయటకు తీశారు. డ్రైవర్ సబల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నందిగాం ఎస్ఐ మహ్మద్ ఆలీ తెలిపారు.

ఉత్సాహంగా నృత్య పోటీలు



బహుమతి అందుకుంటున్న ప్రథమస్థానంలో నిలిచిన జట్టు సభ్యులు

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామంలో సరస్వతీ పూజా మహోత్సవం సందర్భంగా సాయి కిరణ్ ఫ్రెండ్స్ అసోసియేషన్(దాసరివానిపేట) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి మహిళల నృత్య పోటీలను నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన గ్రూపులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబర్చారు. ఈ పోటీల్లో ప్రథమస్థానంలో ఎన్‌డీఎస్ శ్రీకాకుళం, జూనియర్ ఆలీ డోకులపాడు, లిటిల్ స్టార్స్ ఇచ్ఛాపురం జట్లు నిలిచాయి. వీరికి వరుసగా రూ. 25 వేలు, రూ. 15 వేలు, రూ. పది వేలుతో పాటు షీల్డును సాయికిరణ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మాజీ సర్పంచ్ దున్న షణ్ముఖరావు ప్రదానం చేశారు.

ఇదేం 'సర్వీస్'రోడ్డు..!



జాతీయ రహదారికి ఆనుకుని కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద సర్వీస్ రోడ్డు చినుకుపడితే అస్తవ్యస్తంగా మారుతుంది. హైవే పైనుంచి వరద నీటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వర్షం నీరంతా అప్రోచ్ రోడ్డు పైకి చేరడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వరద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. –టెక్కలి

అసంపూర్తి భవనం..!



కవిటి మండల విద్యాశాఖ కార్యాలయానికి పదేళ్ల క్రితం సర్వశిక్షా పథకం కింద అదనపు భవనం మంజూరైంది. రూ.4.5 లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. భవ న నిర్మాణం పూర్తికాకపోవడంతో సిబ్బంది అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహి స్తున్న భవనం చిన్న చినులుపడినా కారిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు. –కవిటి

దుర్గమ్మా..కాపాడమ్మా..!



కంచిలి: మహిషాశురమర్దినిగా కంచమ్మతల్లి అమ్మవారు



సోంపటే: దుర్గా దేవిగా సోంపేట సోమపోలమాంబదేవి



ఇచ్ఛాపురం: సిద్ధదాత్రిగా స్వేచ్ఛావతి అమ్మవారు



వజ్రపుకొత్తూరు రూరల్: గుణుపల్లిలో కుంకుమ పూజల్లో మహిళలు



కవిటి: జాడుపుడి ఆర్‌ఎస్‌లో పూజలందుకుంటున్న దుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలు, మండపాలకు వెళ్లి దుర్గమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్

కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలి



మంత్రి అచ్చెన్నాయిడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి: టెక్కలిలో కోర్టు సముదాయం భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని టెక్కలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంత్రి అచ్చెన్నాయుడును మంగళవారం కోరారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, ప్రతినిధులు డి.వి.వివేకానంద, పి.సాయిరాజు, పి.ఆనంద్, ఎస్.రాజన్నాయుడు, ఐ.మల్లేష్, ఎ.వైకుంఠరావు, ఎం.రాజేష్, ఎం.వెంకటరమణ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

వినతుల స్వీకరణ

మంత్రి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. కొత్తపేట గ్రామానికి చెందిన 26 మందికి ఇళ్ల పట్టాలు, ఆరుగురు అంగన్‌వాడీ సహాయకులకు నియామక పత్రాలను, 21 మందికి సుమారు 23 లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ హరివరప్రసాద్, బి.రమేష్ ఉన్నారు.

వీధిలైట్లు వెలగక అవస్థలు

కంచిలి: మండల కేంద్రం కంచిలి పంచాయతీ పరిధిలోని పలు నివాస ప్రాంతాల్లో వీధిలైట్లు వెలుగక స్థానికులు అవస్థలు పడుతున్నారు. మెయిన్‌రోడ్డులో మతం కంచిలి నుంచి రైల్వేస్టేషన్ కూడలి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని స్తంభాలకు ఉన్న బల్బులు ఇటీవల కురిసిన వర్షాలకు పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్తవాటిని వేసి చీకటి సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.